


# తప్పు

రాంబాబు

తలుపు తడుతున్న శబ్దమైతే వెళ్ళి తలుపు తీసింది రేణు. ఎదురుగా ఒక స్టెయిన్‌లెస్ స్టీల్ గిన్నె పట్టుకుని కనిపించాడు సుధాకర్. 'సాయంత్రం పూట కాస్త పాలు తీసుకుంటోంటారా? మీ పాలమనిషి నాకుకూడా ఇస్తోంది. రోజూ నేను ఆఫీసునుండి వచ్చేసరికి అది వెళ్ళిపోవటం జరుగుతోంది. మీరు యిబ్బంది అనుకోక పోతే...'

'అబ్బే, యిబ్బందికేముందండీ. మాకు పోసినప్పుడే మీకుకూడా పోయించుకోవటమే కదా.' అని పాలగిన్నె అందుకుంది.

అతను థాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడు. తలుపు వేసివచ్చి, పత్రిక చదువుతూ పడుకుంది. ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు. లేచేసరికి నాలుగు దాటింది. వెళ్ళి పనిమనిషి కోసం పెరటితలుపు గడియ తీసి వచ్చింది. పాలమనిషికేక విని, గిన్నె

పుచ్చుకుని వెళ్ళి ముందుతలుపు తీసింది. పాలు తీసుకుంటోండగా సుధాకర్ మాట గుర్తువచ్చింది. తమకోసం పాలుపొయ్యటం అయిపోగానే పాలమనిషిని ఆగమని చెప్పి లోపలికివెళ్ళి ఆ గిన్నెపెట్టేసి, సుధాకర్ ఇచ్చిన గిన్నె పట్టుకుని వచ్చింది. 'ఈ పక్క ఇంటాయన పాలుకూడా ఇక్కడే పోస్తూఉండు ఇకముందునుంచి, ఆయన నాకు చెప్పి వెళ్ళారు' అని అందులోకూడా పాలు పుచ్చుకుని, తలుపు వేసేసి లోపలికి వచ్చింది. అతని గిన్నెమీద మూతపెట్టి, స్టౌ వెలిగించి తమ గిన్నెని దానిమీద పెట్టింది. పాలు ఒక మరుగు రాగానే దింపేసి మూతని కొద్దిగా ఖాళీ వుండేటట్లు వేసి, పడకగదిలోకి వెళ్ళి కూర్చుంది. పనిమనిషి వచ్చినట్లుంది గిన్నెలు తీస్తున్న శబ్దం అవుతోంది.

ఇంతలో తలుపు చప్పుడైతే వెళ్ళి తెరిచింది. సుధాకర్. లోపలికి వెళ్ళి, పాల గిన్నె తీసుకుని వచ్చేసరికి అతను డ్రాయింగ్ రూమ్‌లో నిలబడి బుక్‌రాక్ మీద పెట్టిఉన్న వీక్లీ చూస్తున్నాడు. ఆమెని చూడగానే వీక్లీ బుక్‌రాక్‌మీద పెట్టేసి, 'సారీ, మీకు చాలా ట్రబుల్ ఇస్తున్నట్లున్నాను' అన్నాడు, గిన్నె అందుకోవటానికి ఆమె వైపు రెండడుగులు వేస్తూ. 'అబ్బే ఏం ట్రబుల్ లేదండి' అంది. అతను రెండు చేతులూ చాపి గిన్నెని అందుకున్నాడు. అలా అందుకోటంలో అతని చేతివేళ్ళు ఆమెవేళ్ళకి తగిలాయి. అతను 'వస్తానండి' అని, వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు.

ఆమె తలుపు వేసి గడియారంకేసి చూసింది. అయిదుంపావు అయింది. మోహన్ ఇంకొక అరగంటలో వస్తాడు. టీపాయ్‌మీద పడివున్న కుట్టుసామాను తీసి లోపలపెట్టి, ఫ్లవర్‌వాస్‌లో ఉన్న పువ్వుల్ని మార్చింది. మోహన్‌కి ఇంట్లో అన్నీ సరిగ్గా అమర్చివుండటం ఇష్టం. అన్నీ సర్ది, గుమ్మందగ్గర నిలబడి, అంతా సరిగ్గావుందని చూసుకుని, వెళ్ళి ముఖం కడుక్కుని వచ్చింది. అద్దం ముందు కూర్చుని ముఖానికి లాక్టో కాలమిన్ రాసుకుని దానిమీద కొంచెం లాక్మె నాచురల్ ఫేస్‌పౌడర్ అద్దింది. ఆమెకి నాచురల్ అట్టే ఇష్టంలేదు కాని మోహనోకి ఇష్టం. నుదుటిమీద పింక్ లిప్‌స్టిక్‌తో బొట్టు పెట్టుకుంది. అదికూడా మోహన్‌కోసమే. పెదాలు ఏరంగులోఉంటే అదేరంగులో బొట్టు కూడా ఉండాలంటాడు మోహన్. అతనివన్నీ చాలా చిత్రమైన ఉద్దేశ్యాలు. చంద్రహారంలాంటి కొట్టొచ్చేటట్లు కనపడే నగలు ఇష్టం లేదు. ఒక సన్నని గొలుసు మెడలోఉంటే ఉండే అందం మెడ కనిపించకుండా నగలతో కప్పేస్తే ఉంటుందా—అంటాడు. చీర బాగానేఉంది కాబట్టి మార్చుకోనక్కరలేదనుకుంది అద్దంలో చూసుకుంటూ. మోహన్‌కి తను ఎప్పుడూ ముస్తాబై ఉండటం ఇష్టం. అదికూడా మరీ ఎబ్బెట్టుగా కనిపించేటట్లు అవకూడదు. తొందరలో పౌడరు వేసుకుని సరిగ్గా తుడుచుకోకపోతే, అందరి ఎదురుగానే 'రేణూ! నువ్వు లోపలికి వెళ్ళి కాస్త ఆ పౌడరు తుడుచుకుని వస్తావేమిటి!' అనేస్తాడు.

తలుపు చప్పుడయింది. ఆ తలుపుమీద కొట్టే విధానాన్ని బట్టే మోహన్ అని తెలుసుకుంది. వెళ్ళి తలుపు తెరిచింది. అతను లోపలికి వచ్చి, కాళ్ళూ చేతులూ కడుక్కుని, పేపరు చదువుతో కూర్చున్నాడు. రేణు రెండు ప్లేట్లలో రెండు మైసూరుపాకు ముక్కలు, కాస్త కారపూస తీసుకుని వెళ్ళి అతని ముందు పెట్టింది. లోపలికివచ్చి టీ తయారుచేసి టీ పాట్‌లో పోసి, అదీ, రెండుకప్పులూ రెండు సాసర్లు ట్రేలో పెట్టింది. టీ పాట్‌కి టీ కోజీతొడిగి, ట్రేని తీసుకుని వెళ్ళి టీపాయ్‌మీద పెట్టి, తనుకూడా అతని ప్రక్కని కూర్చుంది. అతను తల ఎత్తి ఆమె వచ్చి కూర్చోవటం చూసి, పేపరు చదువుతోనే కొంచెం కొంచెం కారపూస తీసుకుని తినటం మొదలుపెట్టాడు. అసలు ఆమెకి తీపి యిష్టం లేదు. కాని అతనికి చాలా యిష్టం. అందుకని చేస్తుంది. చెయ్యటమే కాదు — తింటుంది కూడా. ఆమె తినకపోతే అతను కూడా తినడు.

టిఫిన్ తినటం అయిపోయిన తరువాత నెమ్మదిగా టీ పోసింది. అదిగూడా అతను పేపరులోకి చూస్తూనే త్రాగసాగాడు.

అది ఆమెకి యిష్టం వుండదు. రోజల్లా [illegible] వుండదు. కనీసం తను అయినా వచ్చిన తరువాత కబుర్లు చెప్తతే కాస్త తోస్తుంది. దీని తరువాత చేసే కార్యక్రమం ఏమిటో ఆమెకి తెలుసు. సుబ్బారావుగారు ఇచ్చి వెళ్ళిన ట్రాన్సిస్టరో లేక వెంకట్రావుగారు ఇచ్చి వెళ్ళిన రికార్డు చేంజరో రిపేరు చేస్తూ కూర్చుంటాడు. అతనికి వున్న స్నేహితులుకూడా అటువంటివారే. ఎప్పుడు చూసినా ఏదో సహాయం తీసుకోవటమే తప్ప, సహాయం చేసేవారెవరూ లేరు. భోజనం వేళవరకూ వాటితో సతమతమై, భోజనం చేసిన తరువాత రాత్రి పడుకునేటప్పుడు తీరుబడి అవుతుంది — తనని పలకరించడానికి. 'రేణూ! నువ్వు లేనిదే నేను బ్రతకలేను సుమా!' అంటాడు. 'ఏం? వంట వండడానికి ఎవరూ ఉండరనా ఏమిటి?' అని అందామని అనుకుంటుంది కాని అనలేదు. అది అతనిమాటల ప్రభావమో లేక అతనంటే తనకివున్న ప్రేమో ఆమెకి తెలియదు. అతని కౌగిట్లో కరిగిపోయి అతను చెప్పినదంతా సహనంగా వింటూ ఊరుకుంటుంది.

టీ త్రాగటం పూర్తిచేసి, వంటగదిలోకి వెళ్ళి వంటపని మొదలుపెట్టింది. ప్రొద్దున్న చేసిన పప్పుపులుసు ఉండనే ఉంది. ఇంక అన్నం పడెయ్యటమూ, కూర వండటమే. స్టౌమీద నీళ్ళుపడేసి బియ్యం కొలిచింది. కూర ఏం చేద్దామా అని ఒక్కక్షణం ఆలోచించి, రెండు వంకాయలూ మూడు బంగాళదుంపలూ తీసి పెట్టింది. స్టౌమీద పడేసిన నీళ్ళు మరగటం మొదలు పెట్టగానే బియ్యం అందులో పోసి, కత్తిపీట ముందు వేసుకుని కూర్చోబోతోంటే, విమానంలాంటి శబ్దం వినిపించింది. ఆ శబ్దం అంతకంతకూ తమ ఇంటివైపే వస్తున్నట్లనిపిస్తే, ఏమిటో చూద్దామని డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చింది. మోహన్ అప్పుడే గుమ్మం వద్ద నిలబడి చూస్తున్నాడు ఏదో ఆకారం తమ ఇంటివైపే ఏరోప్లేనులా చప్పుడు చేసుకుంటూ వస్తోంది. ఆ లైట్లు చూస్తే కారులాగ ఉంది.

ఆ ఆకారం సరిగ్గా తమ ఇంటి ముందుకే వచ్చి ఆగింది. అప్పుడు పోలు

**మీకు ఆనందాన్నిచ్చే పుస్తకాలు**

1.తెల్సుకోదగ్గవి:-మీజీవితసుఖసంతోషాలకు మీరుతెలుసుకోదగ్గ అనేక వందల అద్భుత విషయాలు.రూ 5-00
2.అద్భుతహాస్యకథలు:-మీరు నవ్వటానికి యితరులను బాగా నవ్వించటానికి కొన్ని వందల నవ్వించే కథలు.రూ.3-50.
3.చిట్కాలు:- చిన్నపరిశ్రమలకు పర్యాటకు సంపాదనకు ఎన్నో రకాల సరుకులు, సులభంగాచేసుకోనే విధానాలు రూ.3-50.
4.మంత్రశక్తి:-మీకోర్కెలు నెరవేర్చుకోవటానికి వివిధమంత్రాలు వాటి అద్భుత రహస్యాలు సాధనమార్గాలు. రూ.3-50.
5.జీవితరహస్యాలు:-మీదాంపత్యజీవితాన్ని సంపూర్ణఆనందమయం చేసుకోవటానికి అనేకదివ్యకామసూత్రాలు రూ.3-50
6.యువతి:- స్త్రీలనుగురించి యువతీయువకులు తెలుసుకోదగిన అనేక అద్భుత కుతూహలవిషయాలు రూ.3-50.
7.సంతానము:-కామసుఖాలు అనుభవించుచు కూడ అవసరం లేనప్పుడు గర్భంరాకుండా 60 సులభమార్గాలు. రూ.3-50.
గీత రచన ఎ.యస్.మూర్తి.యం.ఎ.పోస్టు ఖర్చులు ఉచితం.
దేశసేవ ప్రచురణలు, ఏలూరు.2., ఆంధ్రకు వ్రాస్తే మీకొన్నవలసినవి వి.పి.పోస్టుద్వారా పంపబడును.



వాయిదాల పద్ధతిపై ట్రాన్సిస్టర్

కొయల్



(గ్యారంటితో)
3 బ్యాండ్, ఆల్ వరల్డ్ పోర్టబుల్ ట్రాన్‌సిస్టర్.
ట్రాన్‌సిస్టర్, నెలకు రు. 5/- వంతున చెల్లించి పొందండి. ధర రు. 165. ప్రతి గ్రామము మరియు టౌనుకు పంపవచ్చును.

VIRLA AGENCIES (30)
Roop Nagar, Delhi—7.







# తప్పు

కున్నారు—అది ప్రభాకరంగారి కారని. అందులోంచి ఆయన, భార్య దిగారు. మోహన్ వడివడిగా లోపలికివెళ్ళి వీధిలో పెట్టే బల్బుని తీసుకుని వచ్చి పెట్టే ప్రయత్నంలో ఉండగానే, మామూలుగా ఎప్పుడూ జరిగేటట్లే వాళ్ళు టార్చి సహాయంతో రావటం, నమస్కారాలూ అవీ అయి వాళ్ళు లోపలికి వెళ్ళటం కూడా అయిపోయింది.

మోహన్‌కూడా లోపలికి వచ్చి 'ఏమిటండీ! ఇవాళ డెక్కోటాలో వచ్చినట్టున్నారు' అన్నాడు నవ్వుతూ.

'మీ ఇంటికి వచ్చేదారిలో ఆ టర్నింగ్ వద్ద ఎత్తుగా ఉంది చూడండీ—ఆ కిళ్ళీ కొట్టుదగ్గర—అక్కడ సైలెంసరు ఊడిపోయింది. మీరు ఇంక ఇక్కడ తారు రోడ్డు వేయించాలి' అన్నారు ఆయన హాస్యంగా.

రేణు లోపలికి వెళ్ళి అన్నం అయిపోగానే దింపేసి కాఫీ తయారు చేసి తీసుకుని వచ్చింది. కాఫీలు త్రాగటం అయ్యాక మరో అరగంట కూర్చుని వాళ్ళు వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళిపోయాక ఏవో కబుర్లు చెప్పుకుంటూ అక్కడే కూర్చుండిపోయారు ఇద్దరూ. కొంతసేపటికి టైము చూసేసరికి తొమ్మిది దాటింది. 'అయ్యో నేనింకా కూర చెయ్యాలి' అని గబుక్కుని లేచింది రేణు.

'సరే ఇప్పుడింక కూరేం చేస్తావులే కాని, నదు, అవకాయ వేసుకుని తినేద్దాం ఈరోజుకి' అన్నాడు మోహన్.

'అదేమిటి? వట్టి ఆవకాయతోనా? పోనీ నాలుగు అప్పడాలు వేయిస్తాను, ఇప్పుడే ఐదు నిమిషాల్లో' అంది రేణు.

మోహన్ లేచి బట్టలు మార్చుకుని ఆమె వద్దంటున్నా వినిపించుకోకుండా ఆమెచేతిలోనుండి అట్లకాడ లాక్కుని, తనే స్వయంగా అప్పడాలు వేయించాడు. పైకి చిరుకోపం నటించినా, రేణు అతను తన పై చూపిస్తున్న ఆపేక్షకి లోపల ఆనందించింది.

మర్నాడు మధ్యాహ్నం సుధాకర్ మళ్ళీ వచ్చి పాలగిన్నె ఇచ్చి వెళ్ళాడు. అప్పుడు గుర్తు వచ్చింది రేణుకి—తను ఈ సంగతి ఇంకా మోహన్‌కి చెప్పలేదని. ఆరోజు అతను ఆఫీసునుండి రాగానే చెప్పాలనుకుంది. అసలు నిన్ననే చెప్పివుంటే బాగుండేది. అప్పుడే రెండు రోజులయిపోయింది. ఏమైనా అనుకుంటాడేమో—అనుకుంది.

మళ్ళీ సరిగ్గా ఐదూ పది నిమిషాలకి సుధాకర్ వచ్చాడు. ఈసారి కూడా పాల గిన్నె అతనికి అందిచ్చేటప్పుడు అతని చేతివేళ్ళు ఆమె వేళ్ళకి తగిలాయి. గిన్నె అందుకున్న తరువాత రెండు నిమిషాలు ఏదో మాట్లాడి వెళ్ళిపోయాడు. కూర్చోమందామనుకుని — మళ్ళీ ఎందుకులే — అని ఊరుకుంది.

అంట్లు తోమటం అయినట్లుంది, పనిమనిషి చీపురు పుచ్చుకుని ఊడ్చులకి వచ్చింది.

లోపలికి వచ్చి అద్దం ముందు కూర్చుని ముస్తాబవటం మొదలు పెట్టింది. మనస్సు ఎందుకో సుధాకర్ మీదికి వెళ్ళింది. అతనికి ఇంకా పెళ్ళి కాలేదు. రంగు కొంచెం తక్కువన్నమాట కాని మనిషి అందగాడే. ముఖం కొద్దిగా మనోజ్‌కుమార్‌లాగ ఉంటుంది. తను ఇంకా అలా కనపడాలని కాబోలు, జుత్తుని కూడా ఆ స్టైల్‌లోనే పెంచాడు. మోహన్ ఎప్పుడు అతని గురించి చెప్పినా 'మన మనోజ్‌కుమార్' అనే చెప్తాడు. తనకి అసలు మనోజ్‌కుమార్ అంటే చాలా ఇష్టం కాని మోహన్‌కి ఇష్టం లేదు. 'మగవాడంటే మగవాడిలాగ ఉండాలి. మనోజ్‌కుమార్ నడక, మాటతీరు, ఆ తల ఆడించటం— అంతా ఆడవాళ్ళలాగ ఉంటుంది. షీన్ కన్నెరీ చూడు — నిజమైన మగవాడు' అంటాడు.

సాయంత్రం మోహన్ ఇంటికి రాగానే, 'అన్నట్టు సుధాకర్ లేడూ— పక్క ఇంటతను—అతను వచ్చి, మనం తీసుకున్నప్పుడే తనకి కూడా పాలు తీసుకోమని రిక్వెస్టు చేసాడు. అతను ఆఫీసు నుండి వచ్చేసరికి రోజూ పాల మనిషి వెళ్ళిపోతోందట.' అంది. కాని, తనకి తెలియకుండానే అంత తెలివిగా ఎలా మాట్లాడగలిగిందో తనకే ఆశ్చర్యం వేసింది. ఇలా చెప్పటంలో తను అప్పుడే

అతని కోసం పాలు తీసుకుంటున్నట్లు వ్యక్తం కాలేదు. అలా అని అబద్ధం చెప్పినట్లూ అవలేదు. పైగా అతని అనుమతి తీసుకుంటున్నట్లూ అయింది.

'ఎవరూ మన మనోజ్‌కుమారే? పోనీ తీసుకో. దానికేముంది? నీకూ ఏదో అసలు మనోజ్‌కుమార్ కాకపోయినా, అలాంటి పోలికలున్న వాడేనా రోజూ కంట బడుతున్నాడని తృప్తి వుంటుంది' అన్నాడు నవ్వుతూ.

'నువ్వు అలా అంటే తీసుకోను' అంది ముఖం కొంచెం కోపంగా పెట్టి.

'అబ్బే ఏంలేదు. ఊరికే సరదాకి అన్నాను. అతను పాపం అలా రిక్వెస్ట్ చేస్తే, మానేస్తామా' అన్నాడు. ఆ సంభాషణ అంతటితో ముగిసింది.

మూడవరోజున ఆమె పాలగిన్నె ఇస్తున్నప్పుడు కావాలని ఒక చెయ్యి గిన్నె క్రిందపెట్టి అందిచ్చింది. సుధాకర్ అన్నాళ్లూ, రెండు చేతులతోనూ అంచుని పట్టుకునే అందుకునేవాడు. అలాంటిది ఆరోజు—కేవలం గిన్నె పడిపోకుండా అతి జాగ్రత్తగా పట్టుకుంటున్నట్లు—ఒక చెయ్యి ఆమె చెయ్యి క్రింద ఆన్చి, గిన్నెని అందుకున్నాడు. ఆమెకి ఈసారి కొంచెం కోపం వచ్చింది. అతను వెడితే తలుపు వేద్దామని నిలబడి ఉంది కాని అతను వెళ్లలేదు. ఆమె చీరకేసి పరిశీలనగా చూస్తూ నిలబడ్డాడు. 'ఎక్కడ

# తప్పు

కొన్నారండి ఈ చీర? చాలా బాగుంది' అన్నాడు.

అప్రయత్నంగానే చీరకేసి చూసుకుంది. తెల్ల ఖటావు వాయిల్‌మీద మట్టిరంగు ప్రింట్. పోయినవారమే కొంది. అది మొదటిసారి కట్టుకోవటం కూడా. అతని మీద తనకి వచ్చిన కోపాన్ని తాత్కాలికంగా మర్చిపోయి, 'ఇక్కడే పోయిన వారంలో కొన్నాను' అంది. అతను కొద్ది క్షణాలు ఊరుకుని, 'మీరు ఏమీ అనుకోక పోతే ఒక మాట చెప్పాలని ఉంది' అన్నాడు.

'ఏమిటి?' అని అడిగింది.

'మీ చీరల సెలెక్షన్ చాలా బాగుంటుంది' అన్నాడు.

అతనివద్దనుండి అటువంటిమాట ఆశించని ఆమె ఏమీ మాట్లాడలేదు. కొద్ది క్షణాలు ఆగి, 'ఇట్ ఈజ్ ఎ కాంప్లిమెంట్. మైండ్ యూ' అన్నాడు.

ఒక స్త్రీకి తనని ఎవరైనా పొగిడినప్పుడు కలిగే ఆనందం, బలహీనత ఆమెలో కలిగి, అతని కళ్లల్లోకి చూస్తూ 'థాంక్స్' అంది నవ్వుతూ. అతను వెళ్లిపోయాడు.


వెళ్లి ముఖం కడుక్కుని అద్దం ముందు కూర్చుని ముస్తాబు చేసుకోవటం మొదలుపెట్టింది. సుధాకర్ ఆ విధంగా తన చేతిలోనుండి పాలగిన్నె అందుకోవటం, ఆ విధంగా పొగడటం తప్పుగా తోచినా, ఎందుకో అతని ఆ చేష్ట, మాట తనకి నిజంగా కోపం తెప్పించాయని మాత్రం వొప్పుకోలేక పోతోంది.

మోహన్ రాగానే తన కొత్తచీర గురించి అతను ఏమంటాడో అని ఆత్రుతగా చూడసాగింది కాని అతను ఏమీ అనక పోవటంతో నిస్పృహ చెందింది. అక్కడికీ అతనికి టిఫిన్ పెట్టేటప్పుడు అతని వొళ్లోకి పమిటని జార్చింది కాని అతను గమనించలేదు. ఇంక ఉండబట్టలేక 'ఈ చీర చూసావా? మొన్న మనం వెళ్లినప్పుడు కొన్నది' అంది.

అతను తల ఎత్తిచూసి. 'ఓహ్! బ్యూటిఫుల్, ఇలా దగ్గరికి రా' అని ఆమె దగ్గరికి రాగానే బుగ్గమీద గిల్లి, 'న్యూసెంచ్' అన్నాడు. లేనినవ్వు తెచ్చిపెట్టుకుని 'థాంక్స్' అంది. అతను అలా అనటం కేవలం తనని తృప్తి పరచడానికేనని ఆమెకి తెలుసు.

మర్నాడు సాయంత్రం నాలుగున్నరకి అద్దం ప్రక్కనుండి వెడుతోంటే ముఖం మరీ జిడ్డుగా వున్నట్లనిపించింది. వెళ్లి ముఖం కడుక్కుని వచ్చి అద్దం ముందు కూర్చుంది. పౌడరు రాసుకుని తుడుచుకున్న తరువాత తన ముఖాన్ని పరిశీలనగా చూసుకుంది. మోహన్ తన కళ్లు చాలా అందంగా ఉంటాయని అంటోంటాడు అస్తమానూ. అసలు తనలోని అందమంతా ఆ కళ్లల్లోనే ఉందంటాడు. కాటుక తీసి హేయర్ పిన్‌తో కుడికన్ను పైరెప్ప భాగంలో అంచమ్మట జాగ్రత్తగా రాసింది. క్రింది రెప్పలోపల కూడా రాసి, రెండవకంటికి కూడా అలాగే చేసింది. చీరకూడా నలిగినట్టుంటే మార్చుకుంది. డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్లి గడియారం చూస్తే ఐదు గంటలకి ఇంకా ఐదు నిమిషాలు ఉన్నట్లు చూపించింది. అక్కడే డ్రాయింగ్‌రూమ్‌లోనే ఏం చెయ్యాలా అని ఆలోచిస్తూ కూర్చుంది.

కొంతసేపు అలా కూర్చుని, మళ్లీ గడియారం కేసి చూసింది. ఐదవడానికి ఇంకా మూడు నిమిషాలు ఉంది. ఎందుకో అది స్లో కాదుకదా అని అనుమానం



వచ్చి, లోపలికి వెళ్ళి తన రిస్ట్‌వాచీ చూసింది. అందులో ఐదవడానికి ఇంకా పది నిమిషాలుంది, అది అక్కడే పెట్టేసి వచ్చి, మళ్ళీ డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుంది—పత్రిక తిరగేస్తూ.

తలుపు చప్పుడైంది. ఉత్సాహంగా పత్రిక ప్రక్కన పెట్టి, వెళ్ళి తలుపు తీసింది. రెండిళ్ళవతల ఉంటున్న భాస్కరరావుగారి కూతురు శ్యామల. కలిగిన ఉత్సాహమంతా పోయింది. 'ఏమిటి?' అని అడిగింది నీరసంగా.

'అగ్గిపెట్టె ఒకసారి కావాలని అమ్మ పంపింది' అంది. ఆమెకి అసలు ఈ అరువు అడిగేవాళ్ళంటే వొళ్ళు మంట. కాని ఏం చెయ్యటం? ఆ ఇరుగు పొరుగంతా అటువంటివారే. లోపలికి వెళ్ళి తెచ్చి ఇచ్చింది. శ్యామల వెళ్ళిపోయింది. అక్కడే అలా వీధిలో నిలబడి చూస్తోంటే దూరంగా వస్తున్న సుధాకర్ కనిపించాడు. లోపలికి తిరిగి గడియారం కేసి చూసింది. ఐదుగంటల పదిమిది నిమిషాలు అయింది. 'చాలా పంక్చువల్' అనుకుంది మనస్సులో. ఇంతలో అలా అక్కడ నిలబడి వుండటం బాగుండదని అనిపించి, లోపలికి వచ్చి, పత్రిక చూస్తున్నట్లు కూర్చుంది. అతను వచ్చినట్లున్నాడు – తెరిచే ఉన్నా తలుపుమీద చేత్తో తట్టాడు.

రేణు వెనక్కి తిరిగి అతన్ని చూసి లేచి, 'రండి. మీ కోసమే చూస్తున్నాను' అంది. కాని అలా అన్న వెంటనే 'ఎందుకన్నానా' అనుకుంది.

'నేను మీరు గుమ్మంవద్ద నిలబడి ఉండటం చూశాను' అన్నాడతను.

ఆమె నిజానికి గుమ్మంవద్ద అతని కోసం నిలబడకపోయినా, ఏమిటో ఆ సంగతి చెప్పాలని తట్టలేదు ఆమెకు. 'అంటే...రోజూ కంటే ఆలస్యం అయింది కదూ...ఎందుకు ఆలశ్యం అయిందా అని చూస్తున్నాను' అంది.

'ఆలశ్యమా? అబ్బే లేదే! నేను రోజూవచ్చే టైమే ఇది' అన్నాడు. తన వాచీకేసి చూసుకుంటూ.

రేణు గోడగడియారంకేసి చూసింది. ఐదూ పన్నెండు నిమిషాలు చూపిస్తోంది. ఏమనాలో తోచలేదు. మాట్లాడకుండా



లోపలికి వెళ్ళింది. అసలు తను ఈ అనవసరపు సంభాషణ జరిపి ఉండకపోతే బాగుండేదనిపించింది ఆమెకి. పాలగిన్నె తీసుకుని డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చింది. అతను పాలగిన్నెని ఎప్పటికి మల్లెనే ఆమెవేళ్ళకి తన వేళ్ళని తగిలిస్తూ అందుకుని బుక్‌రాక్‌మీద పెడుతూ 'మీరు ఎక్కడికైనా వెడుతున్నారా?' అని ప్రశ్నించాడు—ఆమె వేషాన్ని చూస్తూ. లేదన్నట్టు తల వూపింది. కాని వెంటనే తను పొరబాటు చేసినట్టు గ్రహించింది. అవునని ఉంటే బాగుండి ఉండేదనుకుంది.

అతను అక్కడే నిలబడి తన వాచీ తీసి, 'వాచి కొంచెం ఫాస్ట్‌గా రన్ అవుతోంది. మీది కరక్టేననుకుంటా' అన్నాడు.

ఆమె మాట్లాడలేదు. అతను తన గడియారాన్ని సర్ది చేతికి తగిలించుకున్నాడు. ఇంక వెడతాడేమో ననుకుంది కాని అతను ఆమె ప్రక్కనుండి ఆమెను కొంచెం రాసుకుంటూ గోడదగ్గరికి నడిచి, అక్కడ ఉన్న కాలెండరుని చూస్తూ 'మోహన్‌గారు మంచిమంచి కాలెండర్లు సంపాదిస్తారండి' అన్నాడు. రేణు నవ్వి వూరుకుంది.

అతను వెనక్కి తిరిగి వచ్చేటప్పుడు కూడా ఆమెని రాసుకుని ఉండేవాడు కాని సరిగ్గా సమయానికి ఆమె కొంచెం ప్రక్కకి తప్పుకుంది. అతను పాలగిన్నె తీసుకుని వెళ్ళిపోయాడు.

# తప్పు

రేణుకి అతనిమీద చాలా కోపం వచ్చింది. కోపంతోపాటు అతని చొరవకి ఆశ్చర్యం, తనమీద అతను చూపిస్తున్న ఆసక్తికి కొంచెం గర్వంకూడా కలిగాయి. తను కాలేజీలో చదివినప్పుడు తన వెనకాల పడ్డ చక్రవర్తి, సత్యనారాయణ, గౌరీశంకర్, రామారావు, ప్రసాద్—అందరూ గుర్తు వచ్చారు. వెళ్ళి అద్దం ముందు నిలబడి తనని తాను చూసుకుని మురిసిపోయింది.

మోహన్ వచ్చిన తరువాత ఈ విషయం అతనికి చెప్పాలనిపించసాగింది ఆమెకి. కాని ఎలా చెప్పాలో అర్థంకాక ఊరుకుంది. అతను తనమీద ఆసక్తి చూపిస్తున్నాడని తెలియచెయ్యాలి. కాని తన తరఫునుండి మాత్రం ఏవిధమైన ఆసక్తి లేదని చెప్పాలి.

మర్నాడు పొద్దుటివరకు ఎలాగో ఊరుకుంది. కాని ఆ తరువాత ఇంక ఉండబట్టలేక పోయింది. మోహన్ ఆఫీసుకి బయలుదేరుదామని జోడు తొడుక్కుంటుండగా వెళ్ళి బుక్‌రాక్‌మీద రెండు మోచేతులూ ఆన్చి, గోడకేసి చూస్తూ, 'ఇదిగో...ఇలాంటివి ఇందుకే నాకు ఇష్టం ఉండవు. నీ దృష్టిలో అందరూ మంచివారే. ఎవరూ చెడ్డవారు కాదు. ఎవరిమీదా ఎటువంటి నేరం చెప్పకూడదు. ఇవాళనుండి పాలు తీసుకోవటం తేవదని ఆ సుధాకర్‌తో చెప్పేసి వెళ్ళు' అంది.

'ఏం?... ఏం జరిగింది?' అని అడిగాడు తల ఎత్తి.

'ఆ...ఏముంది. మామూలే. ఈ మగవాళ్ళకి, చెయ్యి తగిలించటం—వెకిలిగా నవ్వటం ... నాకు ఇలాంటివి వొళ్ళు మంట' అని అతనికేసి చూసింది.

మోహన్ నెమ్మదిగా జోడు ముడి వెయ్యటం పూర్తిచేసి, లేచి ఆమె దగ్గరికి వచ్చి నిలబడ్డాడు. ఆమెచేతిని తన చేతిలోకి తీసుకుని మృదువుగా నొక్కి 'రేణూ! ఇప్పుడు నీ వయస్సెంత?' అని అడిగాడు.

తను చెప్పినదానికీ, అతను అడిగిన దానికి సంబంధం కనిపించక నుదురు చిట్లించి, 'ఇరవై ఐదు' అంది.

'ఇరవై ఐదేళ్ళ వయస్సు ఉంది. కాలేజీలో — అందులో హాస్టలులో ఉండి — బి. ఎ. పూర్తి చేశావు. పెళ్ళిఅయి మూడున్నర ఏళ్ళయింది. ఇప్పటికింకా నీకు, కావాలంటే, మగవాడ్ని దగ్గరగా రాకుండా ఎలా చూసుకోవాలో తెలియదూ? ఈ మాత్రం దానికి నాతో చెప్పాలా?—' అన్నాడు. ఆమె ఆశ్చర్యపోయింది.

అతను వెళ్ళిపోయిన తరువాత చాలా సేపు ఆలోచిస్తూ కూర్చుంది. అతను ఆ అన్నది కోపంగా అనలేదు, కాని ఆ స్వరంలో మందలింపు మాత్రం ధ్వనించింది. తప్పు తనదేనన్న భావం ఉంది.

మధ్యాహ్నం సుధాకర్ పాలగిన్నె ఇచ్చేందుకు వచ్చినప్పుడు 'అక్కడ పెట్టండి' అని టీపాయ్‌కేసి చూపించింది.

సాయంత్రం అతను గిన్నె తీసుకోవటానికి వచ్చినప్పుడు లోపలినుండి గిన్నె తీసుకునివచ్చి, అతనిచేతికి అందివ్వకుండా టీపాయ్‌మీద పెడదామనుకుంది కాని ఇంతలో అతను ఆమె వైపుకి నడిచి, ఆమె చేతులనుండి గిన్నెని అందుకున్నాడు. కాని ఈ సారి అతని చేతివేళ్ళు ఆమె వేళ్ళకి తగలలేదు.

'మీకు చాలా శ్రమ ఇస్తున్నట్టున్నాను' అన్నాడు.

'అబ్బే లేదండి. ఇందులో శ్రమేమి ఉంది?' అంది. అతను వెళ్ళిపోయాడు.

